
ఆఫీసుకి
కొత్త మేనేజర్‌గా
వచ్చిన అతనికి
సిబ్బంది ఇచ్చిన
స్వాగతం?

# ఆఫీసుగోల




ఆఫీసులోకి అడుగు పెట్టాడు కొత్తగ మేనేజర్‌గా అపాయింట్ అయిన ముకుందం. గుమ్మం దాటి లోపలకు అడుగు పెట్టాడో లేదో గోడ గడియారం చిన్నసైజు పేలిన శబ్దంలా విన్పించింది ముకుందంకు.

తల టక్కువ తిప్పి వెనక్కి చూశాడు.

అలా సడన్‌గా చూడటం వలన మెడ నరాలు అటే పట్టుకుపోయాయి. మెల్లిగా ఎలాగోలా గేదెలు తల వూపినట్లుగా ఒక్కసారి అటూ, ఇటూ ఊపాడు. అయినా మెడ నరాలు కలుక్కుమంటున్నాయి.

"హమ్మయ్యా! నేను ఒక్క క్షణం ఆలస్యం అయినా ఆ గడియారం ఒక్క క్షణం ముందయినా నా తల కొబ్బరి చిప్పలా 'టప్'మని ఆరు వక్కలయ్యేది. కానీ అదృష్టం బాగావుండి బ్రతికి పోయాను. గుడ్ లక్" అనుకుని తన అదృష్టానికి మురిసిపోయాడు.

అది ఆఫీసులా లేదు. రైల్వే ప్లాట్‌ఫారంలా ఉంది. టేబుల్ మీద ఎక్కడ పడవేసిన ఫైల్స్ అక్కడే వున్నాయి. శర్మ అన్నీ డిటెక్టివ్‌లా పరిశీలవగా చూస్తూ వస్తున్నాడు. కొత్త మేనేజర్ వస్తున్నారు. కాస్త నీట్‌గా అన్నీ పరిదిద్ది ఘనంగా స్వాగతం చెపుతారు అని ఊహాగానాలు పేక మేడలు కట్టుకున్నాడు మిష్టర్ ముకుందం. అక్కడి పరిస్థితి తారుమారై అతనికి ఆవగింజంత కూడా—పెద్ద సైజు గుమ్మడి కాయంత ఆశ్చర్యం వేసింది.

"సరే చూస్తా వీళ్ల సంగతి—" అని మనసులో అనుకుని ముందుకు నడవ



పోయాడు. కానీ కాలు వదల్లేదు.

"అయ్యబాబోయ్ నా కాళ్లు—" అనుకుని క్రిందికి మిడిగుడ్లేసుకుని మిటకరించి చూశాడు.

క్రింద ఒకడు కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. తన కాలికి అడ్డంగా ఉన్న అతన్ని "ఎవర్నువ్?" ఫేసుమీద క్వశ్చన్ మార్క్‌తో కాసింత కోపాన్ని కలగలిపి

గుడ్లురిమి ఏక్‌దావ్ం ప్రశ్నించాడు.

"ఆ ప్రశ్న నేనడగాల్సింది" సాగదీస్తూ అన్నాడు వాడు.

తల తీసేసినట్లనిపించింది— అనుమానంతో ఒకసారి తలను తడిమి చూసుకున్నాడు.

"హమ్మయ్యా— నా తల ఎక్కడికీ పోలేదులే" అని వెర్రి సన్యాసిలా సంతోషించి అనుకున్నాడు శర్మ. అయినా వెంటనే తేరుకుని తన పేరు చెప్పాడు, స్టయిల్‌గా ఒక కాలు వంకరగా పెట్టి మరొక కాలును ఊపుతూ.

"నీ పేరు ఎవడిక్కావాలయ్యా?" నిద్రమత్తులోనే ఉండి ప్రశ్నించాడు.

అప్పటి వరకు తనపేరు చెప్పగానే మేనేజరు వచ్చాడని కంగారుగా లేచి సలాము చేసి అతి వినయంగా చేతులు జోడించి ఒక నమస్కారం పెట్టేసి ఆ తర్వాత కాళ్ల బేరానికి దిగి పోతాడనుకున్నాడు. కానీ వాడు వేసిన ప్రశ్నకి తన బుర్ర తిరిగి ఖంగుతిన్నాడు. ఇలా జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు శర్మ.

"అమ్మా—వెధవా— నా పేరు చెప్పినా నేనెవరో తెలియలేదన్నమాట. ఆగరా నీ పని చెపుతా— నేనెవర్నో తెలిస్తే నిద్రమత్తు వదలటమే కాకుండా ఒక్కసారిగా లేచి నిల్చొని "నమస్తే సార్! హి.హి.. గుర్తు పట్టలేదు సార్... క్షమించండి సార్" అంటూ వంకలు తిరిగిపోతూ కుక్కలా కాళ్ల దగ్గరికి తోకూపుకుంటూ వచ్చినట్టు వస్తాడు.

"చెప్పవయ్యా బాబూ— నీవెందుకొచ్చావ్?— ఏం పని నీకు?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు వాడు.

ఆలోచనా వలయం నుండి బయట పడ్డాడు శర్మ.

"ఆగరా— నీ పని నా చేతిలో ఈనాడు ఖతం— ఇంకెప్పుడూ ఎవరితోనూ ఇలా అసభ్యంగా ప్రవర్తించవు. ఇంకా నయం వాడు నన్ను ఏమయ్యా అనే అన్నాడు. ఎవడ్రా నువ్వు? నీకేం కావాల్రా? అని అనలేదు" అని అనుకుని "నేను ఇక్కడికి వచ్చిన కొత్త మేనేజర్ ముకుంద శర్మను నేనే"— అని గర్వంగా ఫీలింగొకటి ఇచ్చాడు.

ఆ ఫీలింగు వాడిని ఒక్కసారిగా ఢీకొట్టి వాడిని నిద్రమత్తులో నుంచి బయటపడేలా చేస్తుందనుకున్నాడు. కానీ ఊహించరాని సన్నివేశం జరుగుతుందని ఊహించలేదా క్షణంలో.

"మీరేనా సార్— నేను ఇంకెవరో అనుకున్నాను. నేను ప్యూన్‌ని... స్టాఫంతా లోపలున్నారు సార్" అన్నాడు ప్యూన్ అనబడే వ్యక్తి.

ఈ మాటలు వినయ విధేయతలతో, భయభక్తులతో అనలేదు— పైగా నా నిద్ర ఎందుకోసం చెడగొట్టావు అన్నట్టుగా ఉంది. వాడిఫేస్ మీరెప్పుడెళ్తారా— నేనెప్పుడు నిద్దురపోవాలా అన్నట్టుగా ఉంది.

ఒక్క క్షణం విశ్చేష్టుడైపోయాడు. శరీరం ఒక్కసారిగా బరువెక్కినట్టు అన్పించి దబ్బున మూర్ఛవచ్చి పడిపోయాడు ఊహించని ఆ సంఘటనకి.

ప్యూన్ మాత్రం ఇదేమీ పట్టనట్టుగా చేతులు దులుపుకుని, ఆవులించి, రెండు చిటికెలువేసి గోడకుఒరికి నిద్రపోయాడు.

అయిదు నిమిషాల తర్వాత ఉలిక్కిపడి లేచాడు శర్మ. కొద్దిసేపటికి పరిస్థితి అంతా అర్థమవుతున్నది. జరిగిన విషయాల్ని నత్త నడకలా గుర్తుకు తెచ్చుకుంటున్నది మెదడు.

కొంపదీసి తనకి బి.పి. పెరిగిందా ఏంటీ— ఇంకా నయం గుండె ఆగిపోలేదు— చచ్చూరుకునేవాణ్ణి అని మనసులో అనుకుని ఫ్యాన్ వంక చూశాడు.


తనని పట్టించుకోకుండా హాయిగా నిద్ర పోతున్న ఫ్యాన్ మీద చెప్పలేని కోపం వచ్చింది. ఫ్యాన్ జుట్టు పట్టుకుని లేపి డొక్కలో జెట్ విమానపు స్పీడుతో మోకాలితో పొడవాలనిపించింది.

వెంటనే లేచి నిల్చున్నాడు. కాలు తిమ్మిరెక్కి సరిగ్గా కదలటం లేదు. ఒరే వెధవా, నా కాలు నేను చెప్పినట్టు వినటం లేదు అందుకే బతికిపోయావు అని సమర్ధించుకున్నాడు.

లోపల స్టాఫంతా ఎవరి పనుల్లోవారు పీకల లోతు శ్రమలో కూరుకుపోయి ఉన్నారు. ఇలా ఉంటే ఇక సమస్య ఏముంది. ఏమీ లేదు గాడిద గుడ్డు తప్ప. కానీ వాళ్ల పనులు ఆఫీసు పనులు అని మీరు అనుకుంటే మాడి మసిబొగ్గు అయిన పప్పులో కాలేసినట్టే— వారు చేసేవి ఆఫీసు పనులు కావండోయ్ — వారి వ్యక్తిగత పనులు.

వారి పనులేంటో కాస్త తెలుసుకుందామా— సరే— ఇక— మొదటి టేబుల్ ముందు కూర్చున్న ఒకతను పిల్లవానికి జోలపాట పాడుతున్నాడు. కానీ ఆ పిల్లాడి క్యార్, బేర్‌మనే సైరన్ గొంతు ఆగిపోలేదు సరికదా ఆ పాటకు పక్కన కూర్చున్నతను మాత్రం ఎంతో పరవశించిపోతూ పడుకున్నాడు. ముకుందం ఆ దృశ్యం చూసి ఊగిపోతూ 'స్టాప్' అని గట్టిగా అరిచాడు.

ఆ అరుపుకు ఇంజన్ కూత కేవలం ఒక సెకన్ మాత్రమే ఆగినట్టు ఆగి ఆయన్ని చూసి రెట్టింపుశబ్దంతో సైరన్‌ను



పెంచాడు ఆ పిల్లవాడు. జోలపాడే వ్యక్తి మాత్రం అసలు పట్టించుకోలేదు.

"కొద్ది సేపాగితే పిచ్చాసుపత్రికి పోవడం ఖాయం" అని అనుకుని "ఏమయ్యా ఇది ఆఫీసా లేక కూరగాయల మార్కెట్టా? ఎవరీ పిల్లవాడు? ఏంటి గోల?" అంటూ ప్రశ్నించాడు.

అంతే ఇంతెత్తున లేచాడాయన "ఏమిటీ నువ్వు నా కొడుకుని పట్టుకుని ఎవరి పిల్లాడు అంటావా? నాకు రెండో సెటప్ ఉందనుకుంటున్నావా? ఏంటీ" అని ప్రశ్నించాడు.

"ఓరి నాయనోయ్ — నేను ఏమయ్యా అని అంటే వాడు నన్ను నువ్వు అని అంటాడా" అని మనస్సులో ఒక్క క్షణం ఆలోచించుకుని తన పేరు చెప్పాడు.

అందుకు "నేను క్లర్కు రామేశం సార్— ఇక్కడ మీకేం పని? మీరు మీ రూంలో హాయిగా కూర్చోండి" అని సమాధనపరిచాడు.

"మరి మీ ఆవిడ లేదా? పిల్లాణ్ణి చూసుకుంటానికి" బుస్సున పొంగి వస్తున్న కోపాన్ని నిగ్రహించుకుంటూ.

'మా ఆవిడ మాయా టాకీసుకు మార్నింగ్ షోకి వెళ్లింది. ఆ తర్వాత పక్కింటావిడతో మాధవి టాకీసులో మ్యాట్నీకి వెళ్లి ఆ తర్వాత హోటల్‌కెళ్లి భోజనం చేసి ఆ తర్వాత క్లబ్బుకు వెళ్లి రాత్రి పదకొండుగంటలకల్లా వచ్చేస్తుంది సార్..'

పిచ్చాడిలా చూశాడు. అసలిదంతా కలా, నిజమా అన్న డైలామాలో పడ్డాడు. ఒక్కసారి గట్టిగా గిల్లుకున్నాడు చేయిమీద. వెంటనే నెప్పి పెట్టింది. చేయి వంక ఓసారి చూసుకున్నాడు అనుమానంతో.

చేయిమీద రక్తం. ఇంకొద్ది సేపయితే రక్తం మడుగు తయారవుతుందని కర్చీఫ్‌తో చేయిని అదిమి పట్టుకున్నాడు.

జోలపాటకు నిద్రపోయినాయన్ని లేపాడు.

తేలిగ్గానే నిద్ర నుంచి మేల్కొన్నాడు. "హమ్మయ్యా!" అనుకుని "ఏమిటీ! నీకు ఆఫీసు పనేమీ లేదా— ఇలా కుంభకర్ణుడిలా నిద్రపోతున్నావ్" అని ప్రశ్నించాడు ముకుందం.

"హి..హి.. మీరు భలేవారు సార్— మీకు రామాయణం తెలియదనుకుంటా— నేను చెపుతాను వినండి. రావణాసురుని బ్రదర్ కుంభాకర్ణుడు. అతను సిక్స్‌మంత్స్ తింటాడు, సిక్స్‌మంత్స్ పంటాడు. కానీ మీరు నన్ను కుంభాకర్ణునిలా పోల్చారు. బట్ నేను వన్ ఆర్ టూ సెకండ్స్‌కే నిద్రనుంచి మేల్కొన్నాను. సో యు ఆర్ రాంగ్— మనీ తీయండి" అన్నాడు ఆ వ్యక్తి.

"ఎంత?" ప్రశ్నించాడు వాడిలోకంలో పడి ట్రాన్స్‌లో ఉన్నట్టుగా.

"వంద అంటే జస్ట్ వన్ హండ్రడ్" చిరునవ్వుతో చెప్పాడు.

"ఇంద" అని తీసిచ్చాడు అంతలో ఇంజన్ కూతకి మెలకువ వచ్చినట్టుగా తేరుకుని ఆలోచించాడు. అతని వంద రూపాయలు ఇచ్చినట్టు అతని మెదడు చెప్పింది.

"నా వంద రూపాయలు ఇచ్చేయ్ —"

"భలేవారుసార్— ఈ ఆఫీసుకి కాషియర్ సుందరాన్ని— అది నా జేబులో

పడిందంటే ఆ భగవంతుడు కూడా తీసుకోలేడు'' తన గొప్పతనాన్ని బహు సుందరంగా వర్ణించుకున్నాడు.

''నేను ఈ ఆఫీసుకి మేనేజర్ ముకుందాన్ని.

''అలాగా సార్— చాలా సంతోషం'' అంటూ వీపుమీద చరుచుకున్నాడు సుందరం.

దూరంగా ఒకడు ఫైళ్లతో ఈగలు తోలుకుంటున్నాడు.

కొద్ది దూరంలో ముగ్గురు ఆడవాళ్లు ఒకరితో ఒకరు కబుర్లాడుకుంటున్నారు. అందులో ఒకామె క్లర్కు రామేశం లైపులాగా పసిబిడ్డను ఎత్తుకుని మరీ శ్రద్ధగా వింటుంది ముందుకు కాస్త వంగి.

మరొకామె మాటిమాటికీ హ్యాండ్‌బ్యాగ్‌ను ఓపెన్ చేస్తూ ఒక చిన్న అద్దం తీసి కాస్తంత పౌడర్ ముఖానికి రాసుకుని, లిప్‌స్టిక్ పూసుకుంటుంది సినిమా హీరోయిన్‌లాగా. (సినిమాహీరోయిన్‌లు ఇలామాటిమాటికీ మేకప్ చేసుకుంటారా లేక షాట్ షాట్‌కీ మధ్యలో ఉన్న గ్యాప్‌లో చేసుకుంటారా లాంటి ప్రశ్నలు వేయవద్దని నా మనవి).

తర్వాత మరి నాలుగడుగులు వేశాడు!

అక్కడ ముగ్గురు కూర్చుని పేకాట ఆడుతున్నారు.

వారిలో ఒకడయితే ఏకంగా ఒక బాటిల్ పట్టుకొచ్చాడు. అప్పుడప్పుడు మధ్యలో ఒక రౌండ్ వేస్తూ మరీ ఆడుతున్నాడు.


తనని చూసి వారిలో ఒకడు ''మీరు క్రొత్త మేనేజర్‌గారేనా?'' అని అడిగాడు.

''హమ్మయ్యా! ఇప్పటికి ఒక్కడు గుర్తు పట్టాడు'' అని మనసులో సంతోషించాడు క్రికెట్‌లో సెంచరీ పూర్తయినవాడిలా ఫీలయ్యాడు.

అవునన్నట్టు తలూపాడు.

''రండి మీరు కూడా ఆడండి'' అంటూ కాస్త అటు ప్రక్కకి జరుగుతూ చోటు ఇచ్చాడా వ్యక్తి.

అతను సూటు, బూటు వేసుకున్నాడు.




## ఆవిడ

గుర్నాథం అన్నాడు సోమనాథంతో

''అందరి సంగతి ఏమో తెలియదు కానీ మా ఆవిడ నేనేం చెబితే అది చేస్తుంది. పొద్దుటే బూడిద తెమ్మంటే తెచ్చి ఇస్తుంది. పీమ తెమ్మంటే తెస్తుంది. చింతపండు ఇమ్మంటే ఇస్తుంది. ఆఖరికి పీట తెచ్చి వెయ్యమన్నా వేస్తుంది.

''పొద్దుటే ఇవన్నీ ఎందుకు!''

''అంట్లు తోమడానికి అవన్నీ కావాలికదా!''

– కె.వి.మధుసూదనరావు (కాకినాడ)

"మీరెవరూ?" అంటూ దేబెలాగా ప్రశ్నించాడు.


"అయ్యో నేను మీకు పరిచయం చేసుకోలేదు కదా" అని ముసి ముసిగా నవ్వుతూ "నేను ఈ ఆఫీసుకి నిన్నటిదాకా మేనేజరుని— నేటి నుంచి మీరు మేనేజర్— చివరి రోజు కదా— కాస్త ఖుషీ చేద్దామని — రండి కూర్చోండి" అని అన్నాడు.

వెంటనే అటు వైపుకి తిరుగుతూ "ఈయనగార్కి కూడా ముక్క వేయండి" అని అంటూనే ఉన్నాడు దబ్బున సిమెంటు బస్తా క్రిందపడ్డట్లు శబ్దం వచ్చింది. అంతా ఇటు చూశారు.

ముకుందం— ది గ్రేట్ స్ట్రిక్ట్ ఆఫీసర్ అక్కడ పడిపోయి ఉన్నాడు.

అప్పటికే అతను స్పృహ కోల్పోయి అరక్షణమైంది.

*



డిజైన్: తుమ్మల లక్ష్మీనేతాజీ (హైదరాబాద్)